సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 17 । ఏప్రిల్ । 2023



మక్కకు దిక్కేది..?
యాసంగిలో మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలుపై ఇంకా స్పష్టత రాలేదు. దీంతో రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. 8లో



... ప్రభుత్వాలు విఫలం
సామాన్యులకు న్యాయం చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా ఆరోపించారు. 8లో

గరిష్టం / కనిష్టం
42° / 24°

వాతావరణం
జిల్లాలో సోమవారం మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఉదయం నుంచే ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.



ఇఫ్తార్
(సోమవారం సా॥)
6.31
సహర్
(మంగళవారం ఉ॥)
4.29
రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

నేడు ప్రజావాణి

కొత్తగూడెంఅర్బన్: కలెక్టరేట్ (ఐడీఓసీ)లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఆర్వో అశోక్ చక్రవర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు అందజేయాలని కోరారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

19న జాబ్‌మేళా

సింగరేణి(కొత్తగూడెం): హైదరాబాద్‌లోని ఎల్ అండ్‌టీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో సుమారు 500 పోస్టుల భర్తీకి ఈ నెల 19న కొత్తగూడెం ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి వేల్పుల విజేత తెలిపారు. ఆదివారం ఆమె వివరాలు వెల్లడించారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, డ్రాఫ్ట్‌మెన్ (సివిల్) కోర్సులు పూర్తి చేసిన, 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయసు ఉన్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఉద్యోగానికి ఎంపికైతే మూడు నెలల ఉచిత శిక్షణతోపాటు భోజన వసతి సౌకర్యాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ఖమ్మం, కొత్తగూడెం, వరంగల్, విజయవాడ, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో నియామకాలు ఉంటాయని తెలిపారు. అభ్యర్థులకు నెలకు రూ.16 వేల నుంచి రూ.17 వేల వరకు వేతనం చెల్లించనున్నట్లు, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 19న ఉదయం 10 గంటలకు తమ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి వీఓఏల సమ్మె

అశ్వాపురం: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరుతూ ఐకేపీ వీఓఏలు సోమవారం నుంచి సమ్మెకు దిగనున్నారు. జిల్లాలోని 935 మంది వీఓఏలు సమ్మెకు సిద్ధమైనట్టు సీఐటీయూ అనుబంధ వీఓఏల సంఘం జిల్లా కార్యదర్శి సురకంటి అరుణ తెలిపారు. మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన వీఓఏల సమావేశంలో ఆమె మాట్లాడారు. వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐ, ఈపీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వీఓఏల సంఘం అధ్యక్షులు శ్రీలత, కార్యదర్శి రమాదేవి, కోశాధికారి సత్యవేణి, సుమలత, కవిత, హైమావతి, ధనలక్ష్మి, వీఓఏలు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడిగా శంకర్

పినపాక: ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన ఆరె శంకర్‌ను నియమిస్తూ సంస్థ చైర్మన్ డాక్టర్ సురేష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం శంకర్ వివరాలు వెల్లడించారు. హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా నాటకరంగ దినోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాకారులు

ఖమ్మంగాంధీచౌక్: నెలనెలా వెన్నెల, ఖమ్మం నాటకరంగ కళాకారుల సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం తెలుగు నాటకరంగ దినోత్సవాన్ని నిర్వహించారు. నాటకరంగ ప్రముఖులు, కళాకారులు తొలుత నటరాజ విగ్రహానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా సీనియర్ కళాకారుడు అద్దంకి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. నాటక రంగాన్ని అభివృద్ధి చేసిన వారిని ఎప్పుడూ స్మరించుకోవడమే కళాకారుల కర్తవ్యమని చెప్పారు. ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షుడు డాక్టర్ నాగబత్తిని రవికుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం కళాకారుల సంక్షేమాన్ని విస్మరించిందని అన్నారు. సీనియర్ కళాకారులు డాక్టర్ నాగబత్తిని రవి, హార్మోనిస్టు కొండబాబును సన్మానించారు. వనం కృష్ణారావు, ఏఎస్ కుమార్, వనం అప్పాజీ, ఎస్.సుబ్బరాజు, పుతుంబాక కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లకు కసరత్తు



ధాన్యం కాంటా పెడుతున్న కార్మికులు(ఫైల్)

ధాన్యం దిగుబడి అంచనా 1,56,040 మెట్రిక్ టన్నులు
- యాసంగి సేకరణ లక్ష్యం 80 వేల టన్నులు
- 134 కేంద్రాల ఏర్పాటుకు పౌరసరఫరాల శాఖ నిర్ణయం

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లకు పౌరసరఫరాల శాఖ కసరత్తు చేస్తోంది. ఇటీవల కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సుమారు 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాలో 134 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనుండగా, వీటిలో సహకార శాఖ ద్వారా 99, జీసీసీ ద్వారా 32, డీఆర్‌డీఏ 3 కొనుగోలు కేంద్రాలు నిర్వహించనున్నారు. ధాన్యం దిగుబడి ఇప్పుడిప్పుడే వస్తుండటంతో మరో పక్షం రోజుల్లో కేంద్రాలు ప్రారంభించి, కొనుగోళ్లు చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

క్వింటాల్‌కు రూ.2,060

ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర కూడా పెంచింది. గతంలో ఏ గ్రేడ్‌కు రూ.1,860 ఉండగా, ఇప్పుడు రూ.2,060, సాధారణ రకానికి రూ.1,840 ఉండగా ఇప్పుడు రూ.2,040కు పెంచారు. కొనుగోలు కేంద్రాల్లో రైతాంగానికి సౌకర్యాలు కల్పించాలని, ఇతర జిల్లాల నుంచి ధాన్యం రాకుండా చెక్‌పోస్టు వద్ద పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, టోకెన్లు జారీ చేయాలని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, నాణ్యతపై రైతాంగానికి స్పష్టమైన అవగాహనను కల్పించాలని సూచించారు.

62,416 ఎకరాల్లో సాగు..

జిల్లాలో యాసంగిలో 30,557 మంది రైతులు 62,416 ఎకరాల్లో వరి సాగుచేసినట్లు వ్యవసాయాధికారుల సర్వేలో తేలింది. మొత్తంగా 1,56,040 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో చాలా చోట్ల వరికోతలు జరుగుతుండగా మరికొన్ని చోట్ల ఇంకా ప్రారంభం కాలేదు. గత వానాకాలం సీజన్ ఆలస్యంగా ప్రారంభమై ఆలస్యంగా ముగియడం వల్ల యాసంగి కూడా ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో దిగుబడి కూడా ఆలస్యంగా వస్తోంది. కాగా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి కసరత్తు ప్రారంభమైంది.

ధాన్యం దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నుల్లో..)

మండలం	రైతుల సంఖ్య	విస్తీర్ణం (ఎకరాల్లో)	దిగుబడి (మెట్రిక్ టన్నుల్లో)
అన్నపురెడ్డిపల్లి	2,356	5,271	13,178
అశ్వారావుపేట	676	1,231	3,078
చంద్రుగొండ	1,111	1,740	4,350
దమ్మపేట	2,666	5,966	14,915
ములకలపల్లి	2,570	5,881	14,703
చర్ల	3,087	5,907	14,768
దుమ్ముగూడెం	884	1,582	3,955
చుంచుపల్లి	395	972	2,430
జూలూరుపాడు	388	807	2,018
కొత్తగూడెం	76	111	278
లక్ష్మీదేవిపల్లి	1,449	2,721	6,803
పాల్వంచ	2,793	5,036	12,590
సుజాతనగర్	925	1,498	3,745
ఆళ్లపల్లి	35	38	96
అశ్వాపురం	1,743	3,193	7,983
బూర్గంపాడు	2,134	4,693	11,733
గుండాల	275	469	1,173
కరకగూడెం	1,443	2,671	6,678
మణుగూరు	2,003	4,217	10,543
పినపాక	2,235	6,179	15,448
టేకులపల్లి	642	977	2,443
ఇల్లెందు	671	1,246	3,115
మొత్తం	30,557	62,416	1,56,040



ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ అనుదీప్(ఫైల్)

కేంద్రాల్లో సౌకర్యాలు కల్పిస్తాం



కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా సౌకర్యాలు కల్పిస్తాం. ధాన్యం నాణ్యత విషయంలో రైతులు నిబంధనలు పాటించాలి.
–మల్లికార్జున్‌బాబు, జిల్లా పౌరసరఫరాల అధికారి

రేపు జేబీసీసీఐ 9వ సమావేశం

- 19 శాతం ఎంజీబీకి కోలిండియా ఆమోదం
- మూడు నెలలైనా విడుదలకాని సర్క్యులర్



సింగరేణి(కొత్తగూడెం): కోలిండియా యాజమాన్యం ఈ నెల 18న కోల్‌కతాలో జేబీసీసీఐ 9వ(11వ వేతన సవరణ కమిటీ) సమావేశం నిర్వహించనుంది. 2021 జూన్‌తో 10వ వేజ్ బోర్డ్ కాలపరిమితి ముగిసింది. జూలై 2021 నుంచి కార్మికులకు 11వ వేజ్‌బోర్డ్ అమలు కావాల్సి ఉంది. కానీ 11వ వేతన సవరణ సమావేశాలు ఇప్పటివరకు 8 జరిగాయి. 2023, జనవరి 3న కోల్‌కతాలో నిర్వహించిన 8వ సమావేశంలో కార్మికులకు 19శాతం మినిమమ్ గ్యారెంటీడ్ బెనిఫిట్స్ (ఎంజీబీ) ఇచ్చేందుకు కోలిండియా యాజమాన్యం ఆమోదం తెలిపింది. చివరి సమావేశం జరిగి సుమారు మూడు మాసాలు దాటినా అందుకు సంబంధించిన సర్క్యులర్లను యాజమాన్యం విడుదల చేయలేదు.

22 నెలలు గడిచినా..

- గతంలో వేజ్‌బోర్డు ముగిశాక కనీసం ఆరు నెలల తర్వాత కొత్త వేజ్‌బోర్డు సమావేశాలు నిర్వహించేవారు. కానీ పదో వేజ్‌బోర్డు 2021 జూన్‌తో ముగియగా, మరుసటి నెల జూలైలోనే 11వ వేజ్‌బోర్డు సమావేశాలు ప్రారంభమయ్యాయి. దీంతో కార్మికుల్లో ఆశలు రేకెత్తగా, కోలిండియా యాజమాన్యం కాలయాపన చేస్తూ వారిని నిరాశకు గురిచేస్తోంది.
- ఎనిమిదిసార్లు సమావేశాలు నిర్వహించి, 22 నెలలు గడిచినా కొత్త వేజ్‌బోర్డు కార్యరూపం దాల్చ లేదు. 9వ సమావేశంలో ప్రక్రియ అంతా పూర్తయినా ఫలితాలు అందడానికి కనీసం మరో ఆరు మాసాలు పడుతుందని గని కార్మికులు పేర్కొంటున్నారు. బీపీ గైడ్‌లైన్స్‌తో సంబంధం లేకుండా వేతనాలను సవరించి త్వరితగతిన ఏరియర్స్ చెల్లించాలని కోరుతున్నారు.
- 11వ వేజ్‌బోర్డ్ సర్క్యులర్ త్వరితగతిన విడుదల చేయకపోతే జాతీయ కార్మిక సంఘాలు ఆందోళన బాట పట్టే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.
- ఇప్పటివరకు జరిగిన జేబీసీసీఐ సమావేశాల్లో నాలుగు జాతీయ సంఘాలు ఏఐటీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్, బీఎంఎస్ యూనియన్లు పాల్గొనగా, 9వ సమావేశంలో వీటితోపాటు ఐఎన్‌టీయూసీ కూడా పాల్గొననుంది.

శ్రీకనకదుర్గమ్మతల్లికి విశేష పూజలు



పెద్దమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు



రాగి నాణేన్ని విడుదల చేస్తున్న అర్చకులు, డైరెక్టర్లు

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గమ్మతల్లికి అర్చకులు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పెద్దమ్మతల్లికి అర్చకులు అభిషేకం జరిపారు. తలనీలాలు, ఒడిబియ్యం, చీరలు, కుంకుమ, పసుపు, గాజులు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, డైరెక్టర్లు పాల్గొన్నారు.

రాగి నాణెం విడుదల

భక్తులకు విక్రయించేందుకు పెద్దమ్మతల్లి ఆలయంలో ఆదివారం పెద్దమ్మతల్లి చిత్రంతో ముద్రించిన రాగి నాణేన్ని ఆలయ కమిటీ డైరెక్టర్లు చందుపట్ల శ్రీనివాసరెడ్డి, కిలారు నాగమల్లేశ్వరరావు ఆవిష్కరించారు. ఒక్కో నాణెం ధర రూ.60గా నిర్ణయించారు.

అమ్మవారి సేవలో..

పెద్దమ్మతల్లి ఆలయాన్ని వరంగల్ ఎండోమెంట్ సహాయ కమిషనర్ సునీత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేశారు.

రేపు రుద్రహోమ పూజలు

పెద్దమ్మతల్లి ఆలయంలో ఈ నెల 18న మాసశివరాత్రి సందర్భంగా యాగశాల్లో రుద్రహోమం పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూజలో పాల్గొనే భక్తులు రూ.1,516 చెల్లించి గోత్రనామాలను నమోదు చేసుకోవాలని , పూర్తి వివరాలకు 63034 08458, 98669 23261 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



వేడుకలో పాల్గొన్న భక్తులు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి ఆదివారం సువర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. మూలమూర్తులకు అభిషేకం చేశారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రసాదాలను స్వీకరించారు. సెలవు రోజు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారి సేవల్లో పాల్గొన్నారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం

దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన వెంకటరెడ్డి, ఇందిరమ్మ దంపతులు రూ.1,00,116 విరాళంగా అందచేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, ఆలయ పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గౌతంపూర్‌కు జాతీయ అవార్డు ప్రదానం

రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోనున్న కలెక్టర్ అనుదీప్ బృందం



గౌతంపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

చుంచుపల్లి: మండల పరిధిలోని గౌతంపూర్ గ్రామ పంచాయతీకి సోమవారం జాతీయ స్థాయి బహుమతి ప్రదానం చేయనున్నారు. అవార్డు అందుకునేందుకు సర్పంచ్ పొడియం సుజాత, కార్యదర్శి షర్మిల, కలెక్టర్ అనుదీప్ ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నారు. జాతీయ స్థాయిలో హెల్తీ పంచాయతీ విభాగంలో గౌతంపూర్ మొదటి స్థానం పొందిన విషయం విదితమే. జిల్లాకు జాతీయస్థాయిలో ఈ గౌరవం దక్కడం ఇదే మొదటిసారి. ఉత్తమ పంచాయతీలకు సోమవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా అవార్డులతోపాటు రూ.50 లక్షల నగదు పురస్కారం సైతం అందజేయనున్నారు. దీంతో మూడు రోజుల ముందే గౌతంపూర్ సర్పంచ్ పొడియం సుజాత, కార్యదర్శి షర్మిల ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. కలెక్టర్ అనుదీప్, డీపీఓ రమాకాంత్ ఆదివారం ఢిల్లీకి చేరుకున్నారు. జిల్లా బృందంలోని అందరూ ఆదివారం ఉదయం 11 గంటలకు ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రిపోర్ట్ చేశారు. అనంతరం స్టేజీ మీదకు వెళ్లే అవార్డు గ్రహీతలకు అధికారులు రిహార్సల్స్ నిర్వహించారు. జిల్లా అధికారులు సోమవారం అవార్డును అందుకోనున్నారు.

ఊరు దాటాల్సిందే..!

ఉమ్మడి జిల్లాలో పండ్ల మార్కెట్ లేక అవస్థలు
- పండ్ల తోటలకు పేరుగాంచినా రైతులకు దక్కని ప్రయోజనం
- సూర్యాపేట లేదంటే వరంగల్ వెళ్తేనే మద్దతు ధర
- తడిసి మోపెడవుతున్న రవాణా ఖర్చులు
- తోటల వద్దే అమ్ముదామంటే దళారుల దందా



సత్తుపల్లి ప్రాంతంలో ఓ వ్యాపారి కొనుగోలు చేసిన మామిడి కాయలు(ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: పేరు గొప్ప ఊరు దిబ్బ.. అంటే ఇదే కాబోలు! ఉమ్మడి ఖమ్మం జిల్లా పండ్ల తోటలకు ప్రసిద్ధి అయినప్పటికీ ఇక్కడ మార్కెట్ లేకపోవడంతో దళారులకు లాభాల పంట పండిస్తోంది. రాష్ట్రంలో ఉద్యాన పంటల సాగులో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రథమ స్థానంలో ఉంటుంది. ఇందులో 42 వేల ఎకరాల మేరకు మామిడి తోటలు ఉండగా.. దీర్ఘకాలిక, స్వల్పకాలిక పంటలు మొత్తంగా దాదాపు 70 వేల ఎకరాల్లో సాగవుతాయి. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా పండ్ల మార్కెట్ లేకపోవడంతో రైతులు రవాణా ఖర్చులు భరించి మరీ సూర్యాపేట లేదంటే వరంగల్ వెళ్లాల్సి వస్తోంది. తీరా వెళ్లాక అక్కడి వ్యాపారులు ఏ ధర చెప్పినా తిరిగి రాలేక అమ్ముకుని ఇంటిబాట పడుతున్నారు. ఒకవేళ వెళ్లలేని వారి అశక్తతను గుర్తించిన వ్యాపారులు, దళారులు పంటల సీజన్‌లో ఇక్కడే మకాం వేసి తోటలపైనే పంట కొని లాభాలు గడిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో పంటలెన్నో..

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పండ్ల తోటల్లో ప్రధానంగా మామిడి పంట విస్తీర్ణం అధికంగా ఉంది. మామిడిలో బంగినపల్లి రకం పంట ఎక్కువగా సాగు చేస్తుండగా.. తోతాపురి, హిమాయత్, చిన్న రసాలు, పెద్ద రసాలు తదితర రకాలు ఉన్నాయి. అలాగే, బొప్పాయి(రెడ్ లేబుల్), నిమ్మ (బాలాజీ), అరటిలో జీ–9, కర్పూర, జామలో తైవాన్, అలహాబాద్, సఫేద, పుచ్చకాయలో షుగర్ బేబీ, ఐస్ బాక్స్‌రకాలు, సపోటాలో పాల, క్రికెట్ బాల్, సీతాఫలంలో లోకల్ వెరైటీ, డ్రాగన్ ఫ్రూట్‌లో పింక్ రకాలు పండిస్తున్నారు.

మార్కెట్ సౌకర్యం లేక..

ఉమ్మడి జిల్లాలో విస్తారంగా పండ్ల తోటలు ఉన్నా మార్కెట్ లేదు. దీంతో సీజన్‌లో దళారులు, ఉత్తరాది రాష్ట్రాల వ్యాపారులు చేరుకుని తోటలపైనే పండ్లు కొనుగోలు చేసి తీసుకెళ్తారు. కొందరు రైతులు మాత్రమే వరంగల్, విజయవాడ, సూర్యాపేట, హైదరాబాద్, నాగపూర్ పండ్ల మార్కెట్లలో విక్రయిస్తున్నారు. కొందరు విదేశాలకు కూడా మామిడిని రవాణా చేస్తున్నా.. ఎక్కువ మంది మాత్రం దళారులు చేతుల్లో పంట పెట్టేసి వారిచ్చినంత తీసుకుంటున్నారు.



విదేశాలకు ఎగుమతి కోసం సిద్ధం చేసిన ప్యాకింగ్

రైతులకు అనేక ప్రయోజనాలు

ఉమ్మడి జిల్లాలో పండ్ల తోటలను పరిగణనలోకి తీసుకుని వంద ఎకరాల్లో పండ్ల మార్కెట్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వం దృష్టి సారించి పండ్లను కార్బైడ్ రహితంగా మాగించేందుకు రైఫనింగ్ చాంబర్లు, కోల్డ్ స్టోరేజీ, ప్యాక్ హౌస్, కామన్ ఫెసిలిటేటివ్ సెంటర్లతో మార్కెట్ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

భద్రాద్రి జిల్లాలో ప్రధాన పండ్ల తోటల విస్తీర్ణం, దిగుబడి (మెట్రిక్ టన్నుల్లో)

పంట	రైతుల సంఖ్య	విస్తీర్ణం ఎకరాల్లో	దిగుబడి
మామిడి	3,120	11,320	45,280
అరటి	425	1,971	27,594
బొప్పాయి	112	405	12,960
జామ	260	411	2,466
నిమ్మ	98	168	1,680
మొత్తం	4,015	28,306	1,04,189

మార్కెటింగ్ సౌకర్యం లేక ఇబ్బంది



స్థానికంగా మార్కెట్ సౌకర్యం ఉంటే రైతులకు మంచి ధర దక్కుతుంది. అలాగే, విదేశీ ఎగుమతులపై కూడా అవగాహన పెరుగుతుంది. తద్వారా అదనంగా ధర పొందొచ్చు. కానీ ఇప్పుడు మార్కెటింగ్ సౌకర్యం లేక రైతుల పంట దళారుల పాలవుతోంది.
– బియ్యని రవీందర్, రైతు, రాఘబోయినగూడెం, ఇల్లెందు మండలం

మార్కెట్ ఏర్పాటుతో రైతులకు ప్రయోజనకరం



పండ్ల మార్కెట్ ఏర్పాటైతే రైతులకు మెరుగైన ధర దక్కుతుంది. రైఫనింగ్ చాంబర్లు, ప్యాక్ హౌస్, ఫెసిలిటేషన్ వంటి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. ఉమ్మడి జిల్లాలో రైతులు పండిస్తున్న నాణ్యమైన పండ్లకు ఎప్పటి నుంచో దేశ, విదేశాల్లో డిమాండ్ ఉంది.
– జినుగు మరియన్న, ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి, భద్రాద్రి జిల్లా

క్లుప్తంగా

ప్రశాంతంగా ప్రవేశపరీక్ష



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

పాల్వంచరూరల్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతుల్లో ఉన్న ఖాళీలను పూరించేందుకు ఆదివారం నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని లక్ష్మీదేవిపల్లి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో జరిగిన ప్రవేశ పరీక్షకు వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకున్నారు. మొత్తం 369 మంది విద్యార్థులకు గాను 119 మంది గైర్హాజరయ్యారని వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ తెలిపారు.

ఐలూ ఆధ్వర్యంలో మోడల్ టెస్ట్



ప్రశ్నపత్రం ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సింగరేణి(కొత్తగూడెం): జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ గ్రంథాలయంలో ఐలు ఆధ్వర్యంలో మోడల్ జ్యూనియర్ సివిల్ జడ్జి స్క్రీనింగ్ టెస్ట్‌ను ఆదివారం నిర్వహించారు. ఐలు కార్యదర్శి కిలారు పురుషోత్తమ్ పర్యవేక్షించి మాట్లాడారు. భవిష్యత్‌లో నిర్వహించే జడ్జి పరీక్ష రాసే అభ్యర్థులకు ఈ టెస్ట్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్‌కుమార్ మక్కడ్, డి.రమేశ్, సంతోష్‌లాలుసాహు, పిట్టల రామారావు, రవికుమార్, అరకల కరుణాకర్, మెండు రాజమల్లు, పోతులూరి పాండురంగవిఠల్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం



చుంచుపల్లి: రుద్రంపూర్‌లో చలివేంద్రం ప్రారంభించి నీరు తాగుతున్న శ్రీనివాసరావు

చుంచుపల్లి/కొత్తగూడెంరూరల్: జీఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రుద్రంపూర్, లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిని ఆదివారం రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం రుద్రంపూర్‌లో ఇటీవల మృతి చెందిన శ్రీరాముల వీరాస్వామి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో పుదారి శ్యామ్‌కుమార్, జోగారావు, కాంపెల్లి కనకేశ్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపడి రైతుకు తీవ్రగాయాలు




చికిత్స పొందుతున్న సంతోష్‌కుమార్

టేకులపల్లి: పిడుగుపాటుకు ఓ యువరైతు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని మద్రాస్‌తండా పంచాయతీ కొండంగులబోడు గ్రామానికి జర్పుల శంకర్, ఆయన కుమారుడు సంతోష్‌కుమార్ ఆదివారం వారి పొలానికి వెళ్లారు. సాయంత్రం అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఇంటికి వెళ్లేందుకు ఇద్దరూ సిద్ధం అవుతున్నారు. సంతోష్‌కుమార్ బైక్ స్టార్ట్ చేస్తుండగా బైక్ వద్దనే పిడుగుపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు ఆయన్ను కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు.

కొత్త బస్టాండ్‌లో యువకుడి హల్‌చల్

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం కొత్త బస్టాండ్‌లో ఓ యువకుడు హల్‌చల్ సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాడు. తన కుడి చేయిని బ్లేడుతో కోసుకోగా రక్తమయమైన చేతితో బస్టాండ్ అంతా కలియతిరిగాడు. అతడిని చూసిన ప్రయాణికులు ఒకింత ఆందోళనకు గురయ్యారు. బస్టాండ్‌లో విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు అతడిని నిలువరించటానికి ప్రయత్నం చేసినా వారి మాట వినకుండా ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించాడు. గొల్లగూడెంనకు చెందిన శ్రీకాంత్ (25) ఆదివారం సాయంత్రం ఒకటో నెంబర్ ప్లాట్‌ఫామ్ వద్ద చేయికోసుకోగా అక్కడ అంతా రక్తమయమైంది. ఆ తర్వాత బస్టాండ్ అంతా కలియ తిరుగుతూ హల్‌చల్ సృష్టించటంతో అక్కడి వారు 108కు ఫోన్ చేశారు. కొద్దిసేపటి తర్వాత అక్కడకు చేరుకున్న 108 వాహనం సిబ్బంది అతడికి ఫస్ట్‌ఎయిడ్ చేసి బలవంతంగా వాహనంలోకి ఎక్కించారు. అనంతరం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తన ప్రేమ విఫలం కావడంతోనే ఇలా ప్రవర్తించినట్లు సమాచారం.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,943

మక్కకు దిక్కేది..?

- ఏర్పాటు కాని కొనుగోలు కేంద్రాలు
- దక్కని మద్దతు ధర..
- దళారులతో నష్టపోతున్న రైతులు



విక్రయానికి సిద్ధం చేసిన మొక్కజొన్న

ఇల్లెందురూరల్: వానాకాలం మాదిరిగానే యాసంగిలోనూ మొక్కజొన్న రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా యాసంగిలో అతివృష్టి, అనావృష్టి కారణంగా దిగుబడి తగ్గినా ధరలు ఆశాజనకంగా ఉంటాయనుకున్న రైతులకు నిరాశే మిగులుతోంది. పంట చేతికి రాగానే ధరల పతనం మొదలు కావడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. యాసంగికి సంబంధించి మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలుపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ పరిణామం ఏజెన్సీ పల్లెల్లో దళారులకు కలిసొచ్చేలా ఉంది. ఇదే అదునుగా వ్యాపారులు మద్దతు ధర కంటే దిగువకు కొనుగోలు చేస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టోవాల్సి వస్తోంది. దీంతో ప్రభుత్వ పరంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

వడగండ్లతో కుదేలు

ఆరుగాలం శ్రమించి పంటలను కాపాడుకున్న రైతులకు తీరా పంటలు చేతికందే దశలో వరుణుడు వడగండ్ల రూపంలో తన ప్రతాపం చూపాడు. జిల్లావ్యాప్తంగా 2 వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లగా ఒక్క ఇల్లెందు మండలంలోనే 1,200 ఎకరాలలో నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు తమ నివేదికలో పొందుపర్చారు. భారీ వర్షాలు, వడగండ్ల కారణంగా దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపిందని రైతులు వాపోతున్నారు. వడగండ్లు అధికంగా పడ్డ ప్రాంతాలలో ఎకరానికి 20 క్వింటాళ్లలోపు దిగుబడిరాగా ఇతర ప్రాంతాలలో 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. అయితే, నేలవాలిన చేలలో కంకులు విరిచి ఆరబెట్టేందుకు అత్యధికంగా కూలీ చెల్లించాల్సి వచ్చిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పతనమవుతున్న ధర

ఏటా మొక్కజొన్న పంట చేతికందే సమయంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుంటారు. ఈ విషయంలో ఏ మాత్రం జాప్యం జరిగినా దళారులు తమ మాయాజాలం ప్రదర్శించి మార్కెట్‌లో మద్దతు ధర కంటే తక్కువగా కొనుగోలు చేస్తుంటారు. ఇదే తరహాలో ఈ దఫా కూడా కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో మార్క్‌ఫెడ్ నుంచి స్పష్టత లేకపోవడంతో పదిరోజుల నుంచి మొక్కజొన్న ధర తగ్గుతూ వస్తోంది. వాస్తవంగా ప్రభుత్వం ప్రకటించిన విధంగా మద్దతు ధర రూ.1960 ఉండగా పదిరోజుల కిందటి వరకు రూ.2 వేలు వెచ్చించి కొనుగోలు చేసిన దళారులు క్రమంగా తగ్గిస్తూ ప్రస్తుతం రూ.1,800గా నిర్ణయించారు. ఈ ధర కూడా మరింతగా పతనమయ్యే పరిస్థితి ఉందని తమ అనుచరుల ద్వారా రైతుల వద్ద ప్రచారం చేయిస్తున్నారు. దీంతో కనీస మద్దతు ధరను పక్కన పెట్టి ప్రస్తుతం రూ.1,800కు విక్రయించడంతో రైతులు క్వింటాకు సుమారుగా రూ.200 వరకు నష్టపోతున్నారు. ధర మరింత పతనమైతే పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి ఉండదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు సుమారుగా యాభై శాతం పంట చేతికందగా మిగతా యాభైశాతంలో కంకులు విరవడం, ఆరబెట్టడం వంటి పనులు చేస్తున్నారు.

సమీక్షలతో సరి..

జిల్లాలో యాసంగి పంట దిగుబడులు, కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై రెండు రోజుల కిందట జిల్లా స్థాయిలో ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా మొక్కజొన్న 30 వేల ఎకరాల్లో సాగైందని, ఇటీవల కురిసిన వర్షాల కారణంగా దిగుబడి కొంత తగ్గి సుమారుగా 7 లక్షల క్వింటాళ్లు రైతుల చేతికందే అవకాశం ఉందని క్షేత్రస్థాయి అధికారులు ఉన్నతాధికారులకు నివేదించినట్లు సమాచారం. దీంతో ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకొని త్వరలోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని మార్క్‌ఫెడ్ అధికారులు వెల్లడించినట్లుగా పీఏసీఎస్ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో మొక్కజొన్న అత్యధికంగా సాగైన మండలాల వివరాలు

మండలం	ఎకరాలు
ఇల్లెందు	12200
దమ్మపేట	5086
గుండాల	3467
టేకులపల్లి	2784
అశ్వారావుపేట	1675
ములకలపల్లి	945
లక్ష్మీదేవిపల్లి	778



రికార్డు స్థాయిలో సాగు

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ దఫా యాసంగిలో జిల్లావ్యాప్తంగా 30 వేల ఎకరాల్లో మొక్కజొన్న అధికారికంగా సాగైంది. పోడు భూముల్లో అనధికారికంగా మరో 10 వేల ఎకరాల్లో సాగు చేశారు. వానాకాలం పంట చేతికందిన తరుణంలో వర్షాలు సమృద్ధిగా కురవడంతో ఇతర పంటల కంటే మొక్కజొన్నపై రైతులు ఆసక్తి చూపి సాగు చేశారు. దీంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది.



రోడ్డుపై ఆరబెట్టిన మొక్కజొన్న

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలి



మూడు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. వడగండ్ల వాన కారణంగా ఎకరానికి 25 క్వింటాళ్ల దిగుబడే వచ్చింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రం లేకపోవడంతో స్థానిక వ్యాపారులు రూ.1800కు అడుగుతున్నారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి.

– బానోత్ శ్రీనివాస్, రైతు, పోచారంతండా

తక్కువ ధరకు అమ్మాల్సి వస్తోంది



మొక్కజొన్న పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. కానీ ఆ ఏర్పాటు లేకపోవడంతో మద్దతు ధరకంటే తక్కువగా విక్రయించాల్సి వస్తోంది. క్వింటాకు రూ.200 వరకు నష్టపోతున్నాం. అధికారులు స్పందించి ఇల్లెందులో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

– హరిసింగ్, రైతు, విజయలక్ష్మినగర్

పక్షం రోజుల్లో ఏర్పాటు చేస్తాం



కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా అనుమతి రాలేదు. ప్రస్తుతం జిల్లాలో పంటసాగు విస్తీర్ణం, దిగుబడి వివరాలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి పంపాం. పక్షం రోజుల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం.

– సునీత, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం..



మాట్లాడుతున్న షాబీర్‌పాషా

పినపాక: సామాన్య ప్రజలకు న్యాయం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ జిల్లా కార్యదర్శి షాబీర్‌పాషా ఆరోపించారు. సీపీఐ ప్రజా పోరుయాత్ర ఆదివారం మండలానికి చేరుకుంది. బయ్యారం క్రాస్‌రోడ్‌లో సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా షాబీర్‌పాషా మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ పాలనను గాలికి వదిలేశారని, రాజకీయం కోసం, పదవుల కోసం తప్ప ప్రజా సమస్యలు పట్టడం లేదని మండిపడ్డారు. ఎమ్మెల్యే రేగా కాంతారావు అభివృద్ధి కోసమని పార్టీ మారి ధనార్జనే ధ్యేయంగా పెట్టుకున్నారని ఆరోపించారు. కాగా, యాత్రకు సీపీఎం నాయకులు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య, జిల్లా కమిటీ సభ్యులు మనోహరాచారి, ప్రత్తిపాటి నాగేశ్వరరావు, సీపీఎం మండల కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధే లక్ష్యంగా..

మణుగూరుటౌన్: జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ప్రజా పోరుయాత్ర చేపట్టామని సీపీఐ జిల్లా కార్యదర్శి షాబీర్‌పాషా అన్నారు. ఆదివారం మణుగూరు కిన్నెర కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అనేక రకాల ప్రాజెక్టుల్లో రైతులు రెండు పంటలు పండే భూములను కోల్పోయారని, సీతారామ, బీటీపీఎస్ వంటి ప్రాజెక్టుల కింద భూముల కోల్పోయిన రైతులకు సరైన ప్యాకేజీ అందించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న గిరిజనేతర నిరుపేదలకు సైతం పోడు భూములకు పట్టాలివ్వాలన్నారు. జిల్లాలో గిరిజన యూనివర్సిటీ, మైనింగ్ యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. బీజేపీ హఠావో.. దేశ్‌కీ బచావో.. నినాదంతో సీపీఐ పనిచేస్తుందని స్పష్టం చేశారు. సమావేశంలో జంగం మోహన్‌రావు, దుర్గ్యాల సుధాకర్, మున్నా లక్ష్మికుమారి, సర్వర్, మంగి వీరయ్య, తర్నకుమారి, ధనలక్ష్మి, భూలక్ష్మి, తోట రమేశ్, సత్యనారాయణ, రవి, శివకృష్ణ, బందెల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై చైతన్యయాత్ర

గుండాల: రాష్ట్రంలో ప్రజా సమస్యలపై చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర ఎర్రజెండా సాక్షిగా వదిలేది లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి షాబీర్‌పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య అన్నారు. సీపీఐ చేపట్టిన ప్రజా పోరుయాత్ర ఆదివారం గుండాల మండలానికి చేరుకుంది. దామరతోగు నుంచి వంద బైకులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సాయనపల్లి మాజీ సర్పంచ్, సీపీఐ జిల్లా నాయకులు బచ్చల లక్ష్మీనర్సు స్తూపం ఆవిష్కరించారు. ఖదీర్, గోపి, రావులపల్లి రాంప్రసాద్, బందెల నర్సయ్య, సునీల్, పుల్లారెడ్డి, కల్లూరి వెంకటేశ్వర్లు, ప్రసాద్, శ్రీనివాస్, మున్నా లక్ష్మికుమారి, రేసు ఎల్లయ్య, వాగబోయిన రమేశ్, షాహెద్, గడ్డం శ్రీను, మెస్సు కోటేశ్వరావు, హరీశ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో నాలుగు పతకాలు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్వర్యంలో హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 15, 16వ తేదీల్లో జరిగిన రాష్ట్ర అండర్–20 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో జిల్లా అథ్లెట్లు 4 పతకాలు సాధించారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహిధర్ వివరాలు ఆదివారం వెల్లడించారు. పాల్వంచకు చెందిన అభినయ్‌నాయక్, లాంగ్ జంప్‌లో బంగారు పతకం, ట్రిపుల్ జంప్‌లో రజిత పతకం, దమ్మపేటకు చెందిన టి.మహాలక్ష్మి హైజంప్‌లో బంగారు పతకం, పాల్వంచకు చెందిన బి.దేకేశ్ సామిత్ 400 మీటర్ల హర్డిల్స్‌లో కాంస్య పతకం సాధించారని వివరించారు. క్రీడాకారులు, కోచ్ పి.నాగేందర్‌ను రాష్ట్ర అథ్లెటిక్స్ కార్యదర్శి కె.సారంగపాణి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ మనోహరరావు, పలువురు అభినందించారు.

నగదు అపహరించిన దుండగులు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ బ్యాంకు నుంచి ఓ వ్యక్తి డబ్బు డ్రా చేసి వస్తుండగా గుర్తుతెలియని దుండగులు అపహరించిన ఘటన శనివారం చోటుచేసుకోగా ఆదివా రం కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి.. బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన దారం వెంకటేశ్వర రెడ్డి భద్రాచలంలోని ఓ ప్రైవేట్ బ్యాంకు రూ.2.50 లక్షలు డ్రా చేసి బయట ఓ దుకాణం వద్ద మాట్లాడుతున్నాడు. నంబర్ ప్లేట్లు లేని రెండు ద్విచక్రవాహనాలపై వచ్చిన దండగులు వెంకటేశ్వరరెడ్డి వద్ద ఉన్న నగదు అపహరించి పారిపోయారు. బాధితుడు ఆదివారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండో రోజూ ప్రభుత్వ భూముల ఆక్రమణ

అశ్వారావుపేట: సొంత ఇల్లు లేని పేదలు అశ్వారావుపేటలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను సీపీఐ ఆధ్వర్యంలో ఆక్రమించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం మాట్లాడుతూ 20 ఏళ్లుగా వేలాది మంది నిరుపేదలు అశ్వారావుపేటలో నివాస గృహాలు లేక ఇబ్బంది పడుతున్నారని.. ఎంతమంది అధికారులు, పాలకులు మారినా ఇంటి స్థలాల పంపిణీ జరగడం లేదన్నారు. సీపీఐ మండల సమితి సహకారంతో రెండో రోజు కూడా ప్రభుత్వ భూముల ఆక్రమణ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గన్నిన రామకృష్ణ, సహాయ కార్యదర్శి సయ్యద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో వృద్ధుడి హత్య

కొత్తగూడెంఅర్బన్: వివాహేతర సంబంధం కారణంగా అభం శుభం తెలియని ఓ వృద్ధుడు హత్యకు గురి కాగా, అతడి భార్య కూడా గాయపడిన ఘటన కొత్తగూడెంలో ఆదివారం చోటుచేసుకుంది. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని కూలీలైన్ ఏరియాకు చెందిన పోచయ్య, లచ్చవ్వ దంపతులు చందర్ అనే వ్యక్తిని దత్తత తీసుకున్నారు. అతడు స్థానికంగా ఓ గ్యాస్ కంపెనీలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. కాగా, అదే ఏరియాకు చెందిన ఐటీసీ కాంట్రాక్ట్ ఉద్యోగి హరిప్రసాద్ భార్యకు చందర్ ఫోన్ చేసి ఇబ్బంది పెడుతున్నాడు. విషయం తెలుసుకున్న హరిప్రసాద్ 40 రోజుల క్రితం చందర్ ఇంటికి వెళ్లి సామగ్రి ధ్వంసం చేశాడు. అప్పటి నుంచి చందర్ పారిపోయి వేరే ప్రాంతంలో ఉంటున్నాడు. అయితే ఆదివారం కూలీలైన్‌లోని ఇంటికొచ్చాడనే సమాచారం తెలిసిన హరిప్రసాద్ చందర్ ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో చందర్ లేకపోవడంతో వృద్ధుడైన పోచయ్యను హరిప్రసాద్ బూట్‌కాలుతో తన్నడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన భార్య లచ్చవ్వను సైతం గాయపరిచి హరిప్రసాద్ పారిపోయాడు. విషయం తెలుసుకున్న త్రీటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని హరిప్రసాద్‌పై కేసు నమోదు చేశారు.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్

ముగ్గురికి తీవ్ర గాయాలు



మోకాలుకు తీవ్ర గాయంతో వర్మ

టేకులపల్లి: బైక్‌ను టిప్పర్ ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఉసిరికాయలపల్లికి చెందిన జె.వికాస్, వై.పవన్, ఇల్లెందుకు చెందిన పి.వర్మ ఆదివారం బైక్‌పై టేకులపల్లి వైపు వెళ్తున్నారు. తొమ్మిదోమైలుతండా గ్రామంలోకి రాగానే అదే సమయంలో ఇల్లెందు వైపునకు వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 ద్వారా కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వివాహిత మృతిపై కేసు నమోదు

రఘునాథపాలెం: క్షణికావేశంలో దంపతులు పది రోజుల కిందట ఆత్మహత్యాయత్నం చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భర్త మృతిచెందగా భార్య కోలుకుని ఇంటికి వచ్చింది. తిరిగి ఐదు రోజుల్లోనే ఆమె కూడా అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన మండలంలోని పరికలబోడుతండాలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తండాకు చెందిన బానోత్ చంటి, రత్నకుమారి(24) దంపతులకు ఇద్దరు కుమారులు. ఈ నెల 6న దంపతులు ఘర్షణ పడి పురుగులమందు తాగారు. గమనించిన కుటుంబ సభ్యులు వారిద్దరినీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ చంటి అదేరోజు మృతిచెందగా రత్నకుమారి కోలుకుని ఈ నెల 10న ఇంటికి వచ్చింది. కానీ, చంటి కుటుంబ సభ్యులు ఆమెను ఇంట్లోకి రానీయకుండా ఇబ్బంది పెట్టారని, తర్వాత ఇంట్లోకి రానిచ్చినా వేధింపులు ఆపలేదని మృతురాలి తల్లి కమల తెలిపింది. ఆదివారం రత్నకుమారి మృతిచెందిందని చంటి సోదరుడు అఖిల్, సోదరి శారద ఇతర కుటుంబ సభ్యులు సమాచారం అందించడంతో అక్కడికి వెళ్లి చూశానని, తన కుమార్తె మరణంపై అనుమానం ఉందని పోలీసులకు కమల ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. కాగా, ఖమ్మంరూరల్ మండలం పెద్దతండాకు చెందిన కిరణ్ అనే వ్యక్తి రత్నకుమారి సెల్‌ఫోన్‌కు పంపించిన మెసేజీల కారణంగానే దంపతుల మధ్య వివాదం చెలరేగిందని, అప్పుడే వారు పురుగులమందు తాగారని గ్రామస్తులు చెబుతున్నారు. కాగా, తల్లిదండ్రులు మృతిచెందటంతో వారి కుమారులిద్దరూ అనాథలుగా మారారు.

లారీకింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మంక్రైం: లారీకిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నగరంలో ఆదివారం చోటు చేసకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీనివాసనగర్‌కు చెందిన సామినేని శ్రీనివాస్ (45) ఇటీవల తరచూ ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తున్నాడు. ఆదివారం బోనకల్ క్రాస్‌రోడ్ వద్ద లారీకిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి వద్ద లభించిన పత్రాల ఆధారంగా శ్రీనివాస్‌గా గుర్తించిన పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అన్నం ఫౌండేషన్ నిర్వాహకులు అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. అతడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వెంకటేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిచ్చి కుక్క దాడిలో మహిళకు తీవ్రగాయాలు



గాయపడిన మహిళ

సుజాతనగర్: మండలంలో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను తీవ్రంగా గాయపరుస్తున్నాయి. ఆదివారం పిచ్చికుక్క దాడిలో మహిళ తీవ్రంగా గాయపడిన ఘటన సుజాతనగర్‌లో చోటుచేసుకుంది. సుజాతనగర్‌కు చెందిన ఎస్‌కే కరీంబీ ఇంట్లో వంట చేస్తుండగా ఓ పిచ్చికుక్క ఇంట్లోకి దూరింది. మహిళ చీరను నోట కరుచుకొని తీవ్రంగా దాడి చేసింది. భయంతో కేకలు వేయడంతో స్థానికులు వచ్చి కుక్కను తరిమివేశారు. చేతులు, కాలిపై తీవ్ర గాయాలైన మహిళను 108లో కొత్తగూడెం తరలించారు.

నీ వెంటే నేనంటూ..

భర్త చనిపోయిన మరుసటి రోజే భార్య మృతి



భాస్కర్‌రావు, బాయమ్మ (ఫైల్)

పాల్వంచ: భర్త చనిపోయిన తెల్లవారే భార్య కూడా మృతిచెందిన ఘటన పాల్వంచలో ఆదివారం చోటుచేసుకుంది. పట్టణంలోని నవనగర్‌కు చెందిన కేటీపీఎస్ రిటైర్డ్ ఉద్యోగి శ్యాంపూరి భాస్కర్ రావు(80) గుండెపోటుతో శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. దీంతో 45 ఏళ్ల పాటు అతడి వెంట నడిచిన భార్య బాయమ్మ(72) తట్టుకోలేకపోయింది. శనివారం నుంచి రోదిస్తూ ఉన్న ఆమె ఆదివారం గుండెపోటుతో మృతిచెందింది. కాగా, ఒకరోజు వ్యవధిలోనే తల్లిదండ్రులను కోల్పోయిన వారి కుటుంబంలో తీరని విషాదం నెలకొంది.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం లాలుతండా పంచాయతీలోని బోరింగ్‌తండాకు చెందిన లవ్‌కుమార్ (30) విద్యుదాఘాతంతో మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. తండాకు చెందిన లవ్‌కుమార్ తన ఇంటి వద్ద బాత్‌రూమ్‌లో స్నానం చేసి చేతులు పైకెత్తాడు. పైకప్పు లేకపోగా విద్యుత్ వైరు ఉంది. దానికి చేతులు తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని సమితిసింగారం గ్రామానికి చెందిన బోరా మోహన్‌సీతారాంరెడ్డి(22) ఆదివారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మోహన్‌సీతారాంరెడ్డి చిన్నతనంలోనే తల్లిదండ్రులు మృతి చెందటంతో.. సమితిసింగారంలోని మేనమామ బంగారురెడ్డి ఇంట్లో ఉంటూ డిగ్రీ చదువుతున్నాడు. పది రోజులుగా కాలేజీకి సరిగ్గా వెళ్లకపోవడంతో మేనమామ మందలించారు. రాత్రి 11 గంటలకు తనగదిలోకి వెళ్లిన మోహన్‌సీతారాంరెడ్డి ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బంగారురెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ముత్యం రమేశ్ తెలిపారు.

యువకుడికి బెదిరింపులు

దమ్మపేట: వాట్సాప్ స్టేటస్ కారణంగా యువకుడిపై కొందరు బెదిరింపులకు దిగిన ఘటన మండలంలోని ముష్టిబండ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బండారుపల్లి ప్రసాద్ (32) మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చిత్రాన్ని వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకున్నాడు. అదే గ్రామానికి చెందిన రావు రవిశంకర్, మరో నలుగురితో కలసి గ్రూపుగా ఏర్పడి, బైక్‌లపై బండారుపల్లి ప్రసాద్ ఇంటి వద్దకు వెళ్లి, ప్రసాద్ తల్లిని భయభ్రాంతులకు గురిచేశారు. అసభ్య పదజాలంతో దూషించారు. అనంతరం గ్రామంలో గల తెలంగాణ తల్లి విగ్రహం వద్దకు వచ్చి, ప్రసాద్‌కు ఫోన్ చేసి వాట్సాప్ స్టేటస్‌లో ఉన్న చిత్రాన్ని తీసేయాలని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

మహిళ అనుమానాస్పద మృతి

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ లాడ్జిలో కృష్ణాజిల్లాకు చెందిన మహిళ (35) ఆదివారం ఫ్యాన్‌కు ఉరివేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. లాడ్జి నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని, ఆమె గదిలో ఉన్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మృతికి సంబంధించిన విషయాన్ని ఆమె కటుంబ సభ్యులకు చేరవేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

క్లుప్తంగా...



గర్భిణిని అంబులెన్స్‌లో తరలిస్తున్న ఎంపీపీ సుధీర్‌రెడ్డి

అంబులెన్స్ డ్రైవర్‌గా ఎంపీపీ

బొమ్మలరామారం: అత్యవసర పరిస్థితిలో అంబులెన్స్ డ్రైవర్ అందుబాటులో లేకపోవడంతో.. ఓ ఎంపీపీ డ్రైవర్‌గా మారి గర్భిణీని ఆస్పత్రికి తరలించి అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం ఖాజీపేట్ గ్రామంలోని ఇటుక బట్టీలో పని చేసే ఓ వలస కార్మికురాలు గర్భవతి. ఆమె వైద్య పరీక్షల నిమిత్తం ఆదివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి వచ్చింది. మెరుగైన వైద్యం అవసరమని భావించిన సిబ్బంది, ఆమెను భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఆమెను తీసుకెళ్లడానికి పీహెచ్‌సీలోని అంబులెన్స్ డ్రైవర్ అందుబాటులో లేకపోవడంతో.. నిర్వహణ బాధ్యతలు తీసుకున్న ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డికి సిబ్బంది సమాచారం అందించారు. సదరు గర్భిణీకి అత్యవసరంగా వైద్యం అవసరమని తెలిపారు. వెంటనే ఎంపీపీ సుధీర్‌రెడ్డి తానే డ్రైవర్‌గా మారి, గర్భిణీని అంబులెన్స్‌లో భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం వైరల్ కావడంతో ఎంపీపీని స్థానికులు అభినందిస్తున్నారు.

బీసీ కుల గణన సాధన కోసం పోరుబాట: జాజుల

లాలాపేట: బీసీ కుల గణన చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న నల్గొండ నుంచి నడిగడ్డ వరకు 33 జిల్లాల్లో బీసీల పోరుబాట కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చే క్రమంలో రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న బీసీల పోరుబాటకు బీసీ సంఘాలు, కుల సంఘాలు, మేధావులు, ఉద్యోగులు మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం ఓయూ ప్రొఫెసర్స్ క్వార్టర్స్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ కుల గణన చేస్తామని మొట్టమొదటిసారి తెలుగు రాష్ట్రాల నుంచి ఏపీ సీఎం వైఎస్ జగన్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. ఏపీ సీఎం జగన్‌ను ఇతర రాష్ట్రాల సీఎంలు ఆదర్శంగా తీసుకుని అసెంబ్లీలో తీర్మానాలు చేసి కేంద్రానికి పంపాలని కోరారు.

మక్కలు ఇంకెప్పుడు కొంటరు?

ఇంకా ఏర్పాటుకాని కొనుగోలు కేంద్రాలు

- ప్రభుత్వ నిర్ణయం కోసం మార్క్‌ఫెడ్ ఎదురుచూపులు
- అనుమతితో పాటు బ్యాంక్ గ్యారెంటీ ఇస్తేనే ముందుకు సాగే యోచన
- మార్కెట్‌లో పడిపోతున్న ధర
- ఆందోళనలో రైతాంగం



కామారెడ్డి జిల్లా భిక్కనూరులో సర్వీస్ రోడ్డుపై ఆరబోసిన మక్కలు

సాక్షి, కామారెడ్డి: మక్కల కొనుగోలుపై సర్కారు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో దళారులు చెప్పిందే ధర అవుతోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, మార్కెట్‌లో మక్కల ధర రోజురోజుకూ పతనం అవుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. యాసంగి సీజన్‌లో రాష్ట్రంలో 6,48,446 ఎకరాల్లో మక్క పంట సాగైంది. ఈసారి పంట ఆశాజనకంగా ఉండటంతో దిగుబడి కూడా ఎక్కువగా వస్తుందని భావిస్తున్నారు. సగటున ఎకరాకు 29 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ చెబుతోంది. ఈ లెక్కన మొత్తంగా దాదాపు 2 కోట్ల క్వింటాళ్ల మక్కల దిగుబడి వచ్చే అవకాశాలున్నాయని అంటున్నారు. కాగా మక్కల కొనుగోలు వ్యవహారాన్ని మార్క్‌ఫెడ్ చూస్తుంది. అయితే ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌కు అనుమతి ఇవ్వడంతో పాటు అవసరమైన బ్యాంక్ గ్యారెంటీ ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా చేస్తేనే మార్క్‌ఫెడ్ మక్కల కొనుగోలు ప్రక్రియ మొదలు పెడుతుంది. కానీ సర్కారు ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో మక్కల కొనుగోలు వ్యవహారం ముందుకు సాగడం లేదు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో మక్క పంట కోసి, జూళ్లు వేశారు. కొన్ని ప్రాంతాల్లో జూడు తీసి, మక్కలు ఒలిచి ఆరబెడుతున్నారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో మక్క కోయాల్సి ఉంది.

■ తగ్గుతున్న ధర..

మక్క పంట చేతికి అందే సమయంలో తొలుత బహిరంగ మార్కెట్‌లో క్వింటాలుకు రూ.2,400 వరకు ధర పలికింది. కానీ పక్షం రోజులుగా ధర తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.1,800 మాత్రమే చెల్లిస్తున్నారు. గతంలో పౌల్ట్రీ పరిశ్రమలో కోళ్లకు దాణాగా మక్కలను వాడేవారు. ప్రస్తుతం మక్కల కన్నా బియ్యం నూకలు తక్కువ ధరకు లభిస్తుండటంతో పౌల్ట్రీ రంగం మక్కల కొనుగోలుపై ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. దీంతో స్థానికంగా మక్కలకు డిమాండ్ పడిపోతోంది. మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తే తప్ప తమకు మద్దతు ధర లభించే అవకాశం లేదని రైతులు చెపుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు ఏర్పాటు చేస్తుందా అని వారు ఎదురుచూస్తున్నారు.

మార్క్‌ఫెడ్ కొనాలి..



నేను మూడు ఎకరాల్లో మక్క పండించిన. ఈసారి పంట మంచిగనే వచ్చింది. అయితే మార్కెట్‌లో మద్దతు ధర లభించడం లేదు. మొదట్లో క్వింటాలుకు రూ. 2,400 ధర పలికింది. ఇప్పుడు అమ్ముదామనే సమయానికి రూ.1,800లకు పడిపోయింది. మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

–గడ్డం బాల్‌రెడ్డి, రైతు, మోతె, లింగంపేట మండలం, కామారెడ్డి జిల్లా

కేంద్రాలు తెరవకుంటే ఇబ్బందే



ప్రభుత్వం మక్కల కొనుగోలుకు కేంద్రాలు ఏర్పాటు చేస్తేనే మాకు నాలుగు పైసలు మిగులుతయి. లేకుంటే ఏం లాభం ఉండదు. ఇప్పుడు మార్కెట్‌లో ఉన్న ధరకు అమ్ముకుంటే అప్పులే మిగులుతయి. కేంద్రాల ఏర్పాటు ఇప్పటికే ఆలస్యమైంది. ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకుని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలి.

– బండారి లింగం, రైతు, తాడ్వాయి మండలం, కామారెడ్డి జిల్లా

యూఏఈలో విజిట్ వీసా నిబంధనలు కఠినతరం

- గడువు తీరిన తర్వాత ఉంటే నిషేధిత జాబితాలోకి..
- యూఏఈతో పాటు ఇతర గల్ఫ్ దేశాల్లో ప్రవేశంపై నిషేధం



మోర్తాడ్(బాల్కొండ): వీసా నిబంధనల ఉల్లంఘనలను అరికట్టడానికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం కఠిన నిబంధనలను అమలులోకి తీసుకువచ్చింది. విజిట్ వీసాలపై యూఏఈకి వచ్చినవారు గడువు ముగిసిన తర్వాత ఒక్కరోజు కూడా ఎక్కువగా ఉండడానికి వీలు లేకుండా చర్యలు చేపట్టింది. సాధారణంగా యూఏఈ 30, 60 రోజుల విజిట్ వీసాలను జారీ చేస్తుంటుంది. ఈ వీసాలపై యూఏఈకి వచ్చిన వారు గడువు ముగిసిపోకముందే వెళ్లిపోవాల్సి ఉంటుంది. ఇకపై తమ దేశంలో ఒక్కరోజు ఎక్కువగా ఉన్నా నిషేధిత జాబితాలో చేరుస్తామని అక్కడి సర్కారు ప్రకటించింది. దీనివల్ల వీసా నిబంధనలు ఉల్లంఘించినవారు యూఏఈతో పాటు ఇతర గల్ఫ్ దేశాల్లో ప్రవేశానికి అనర్హులు అవుతారు. విజిట్ వీసాలపై వచ్చి యూఏఈలో చట్టవిరుద్ధంగా ఉంటున్నవారి సంఖ్యను తగ్గించుకోవడంతో పాటు ఎవరైనా చట్టబద్ధంగానే తమ దేశంలో ఉండే విధంగా యూఏఈ ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటోంది. యూఏఈలో ఉపాధి చూపిస్తామని.. తొలుత విజిట్ వీసాపై వెళ్లాక, తర్వాత వర్క్ వీసా ఇప్పిస్తామని చెప్పే ఏజెంట్ల మాటలను నిరుద్యోగులు నమ్మవద్దని గల్ఫ్ వలస కార్మిక సంఘాల ప్రతినిధులు సూచిస్తున్నారు.



బీబీనగర్ టోల్‌గేట్ వద్ద నిలిచిన వాహనాలు

హైవేపై వాహనాల రద్దీ

చౌటుప్పల్, బీబీనగర్: యాదాద్రి భువనగిరి జిల్లా హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం ఒక్కసారిగా వాహనాల రద్దీ పెరిగింది. శుభకార్యాలు ఉండడంతో హైదరాబాద్ జంటనగరాలతో పాటు వివిధ ప్రాంతాల ప్రజానీకం వాహనాల్లో రాకపోకలు సాగించారు. దాంతో చౌటుప్పల్ పట్టణంలో, జంక్షన్‌ల వద్ద రోడ్డు దాటేందుకు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. అదేవిధంగా యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం మండలంలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద కూడా వాహనాల రద్దీ నెలకొంది. యాదాద్రి పుణ్యక్షేత్రానికి భక్తులు పెద్దఎత్తున వాహనాల్లో తరలి రావడంతో టోల్‌ప్లాజా వద్ద ఉదయం, సాయింత్రం సమయాల్లో విపరీతమైన రద్దీ ఏర్పడింది.



క్యాజువాలిటీలో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దాస్పత్రిలో కలెక్టర్ అర్ధరాత్రి తనిఖీ

వైద్య సేవలపై ఆరా

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ పీవీ గౌతమ్ శనివారం అర్ధరాత్రి 2 గంటలకు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన విధుల్లో చేరినప్పటి నుంచి ఈ ఆస్పత్రిపై ప్రత్యేక నిఘా పెట్టారు. తరచూ ఆకస్మిక తనిఖీలు చేపడుతూ వైద్యులు, సిబ్బంది సక్రమంగా పని చేసేలా చూస్తున్నారు. కలెక్టర్ ఏ సమయంలో వస్తారో తెలియక ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు. కలెక్టర్ తాజాగా శనివారం అర్ధరాత్రి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి ఆకస్మిక తనిఖీ చేశారు. మెటర్నిటీ లేబర్ రూమ్‌ను పరిశీలించారు. డాక్టర్, సిబ్బంది విధులపై ఆరా తీశారు. కాజువాలిటీ, ఐసీయూ గదులతో పాటు రిజిస్టర్లు పరిశీలించి డ్యూటీ డాక్టర్లు ఎంతమంది ఉన్నారని తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి ఎక్కువగా పేదలే వస్తుంటారని, మెరుగైన సేవలు అందించి వారికి నమ్మకం కల్పించాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రుల్లో సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చిస్తోందని, సిబ్బంది కూడా సక్రమంగా పని చేసి మానవతా దృక్పదంతో మెలగాలని చెప్పారు.

జిల్లా వార్తలు

రామాలయానికి హుండీల బహూకరణ



ఈఓకు హుండీలు అందజేస్తున్న దాతలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి నల్గొండకు చెందిన కంభంపాటి జ్ఞానేశ్వర్ రూ.1.80 లక్షల విలువైన హుండీలను బహూకరించారు. వీటిని ఆలయంలో అవసరమైన చోట ఉపయోగించాలని ఈఓ రమాదేవిని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రావణ్‌కుమార్, సూపరింటెండెంట్ కత్తి శ్రీనివాస్, ఆలయ ఇన్‌స్పెక్టర్ రామిరెడ్డి, సీసీ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి



రిజర్వాయర్‌లో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: కిన్నెరసాని పర్యాటక ప్రాంతంలో ఆదివారం సందడి నెలకొంది. వివిధ జిల్లాల నుంచి కూడా సందర్శకులు తరలివచ్చారు. డీర్ పార్కులోని దుప్పులను, డ్యామ్ పైనుంచి జలాశయాన్ని వీక్షించారు. అనంతరం జలాశయంలో బోటు షికారు చేశారు. 442 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్‌కు రూ.16,045 ఆదాయం లభించింది. 240 మంది బోటింగ్ చేయడం ద్వారా టూరిజం శాఖకు రూ.14,720 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

సుధారాణికి తెలుగురత్న పురస్కారం

సత్తుపల్లి: సత్తుపల్లికి చెందిన ఆయుర్వేద వైద్యురాలు కొనకళ్ల సుధారాణి ఆదివారం తెలుగు రత్న పురస్కారాన్ని అందుకున్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో భారతీయం, తెలుగు అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా ఆధ్వర్యంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. సనాతన ఆయుర్వేదం, సేవా కార్యక్రమాలతో సమాజ హితానికి కృషి చేస్తున్నందుకు గాను ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు ఈ పురస్కారం అందించి సత్కరించారు.

చేసేవాళ్లు లేరు.. చెప్పేవాళ్లూ లేరు !

- ఖమ్మం పాడి పరిశ్రమలో ఉద్యోగులు, సిబ్బంది కొరత
- ప్లాంట్ నిర్వహణ మొత్తం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల చేతుల్లోనే
- డీడీ కార్యాలయంలో ఇద్దరే రెగ్యులర్ ఉద్యోగులు
- సస్పెండ్ అయిన వారి స్థానాలు భర్తీ కాక ఇక్కట్లు



ఖమ్మంలోని విజయడెయిరీ ప్లాంట్

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మంలోని పాడి పరిశ్రమ (విజయ డెయిరీ) నిర్లక్ష్యానికి గురవుతోంది. పరిశ్రమ నిర్వహణ సక్రమంగా లేక ప్రాభవం కోల్పోతుండడంతో రైతులు ప్రైవేట్ డెయిరీల బాట పడుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుంటున్న ప్రైవేట్ డెయిరీల యాజమాన్యాలు మరిన్ని ప్రోత్సాహకాలు ప్రకటిస్తూ రైతులను ఆకర్షిస్తుండగా విజయ డెయిరీ క్షీణస్థితికి చేరుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పాడి వనరులను గుర్తించి 50 ఏళ్ల క్రితం ఇక్కడ పాడి పరిశ్రమను నెలకొల్పారు. అప్పట్లో 50 వేల లీటర్ల పాల సామర్థ్యంతో జిల్లా కేంద్రంలోని రోటరీనగర్ వద్ద ఐదెకరాల విస్తీర్ణంలో పరిశ్రమతో పాటు అధికారులు, ఉద్యోగుల నివాస గృహాలను నిర్మించారు. దీనికి తోడు ఉమ్మడి జిల్లాలో 10 శీతలీకరణ కేంద్రాలను కూడా ఏర్పాటు చేయగా.. 50 మంది అధికారులు, ఉద్యోగులతో పాటు మరో 50 మంది సిబ్బంది, కార్మికులకు ఉపాధి కల్పించేలా నెలకొల్పిన పరిశ్రమ నేడు దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటోంది.

ఉన్నదే అరకొర.. ఆపై సెలవులు

విజయ డెయిరీలో పాడి పరిశ్రమ ఉపసంచాలకుల కార్యాలయం, ప్లాంట్, పాల శీతలీకరణ కేంద్రాలు ఉన్నాయి. ఇలా మూడు విభాగాలుగా నిర్వహణలో ఉన్న ఈ పరిశ్రమలో ప్రస్తుతం ఐదుగురు మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారు. వీరిలోనూ ఒకరు సెలవులో వెళ్లారు. అంటే ప్రస్తుతం నలుగురే పనిచేస్తున్నారు. ఇక డిప్యూటీ డైరెక్టర్(డీడీ) కార్యాలయంలో మొత్తం ఎనిమిది పోస్టులు ఉండగా కేవలం డిప్యూటీ డైరెక్టర్, జూనియర్ మేనేజర్ మాత్రమే పనిచేస్తున్నారు. మిగతా ఆరు పోస్టులు ఏళ్ల నుంచి ఖాళీగానే ఉన్నాయి.

ప్లాంట్‌లో రెగ్యులర్ ఉద్యోగులే లేరు...

ఖమ్మం పాడి పరిశ్రమ(ప్లాంట్)లో రెగ్యులర్ ఉద్యోగి ఒక్కరు కూడా లేరనేది నమ్మలేని నిజం. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో ప్లాంట్‌ను నిర్వహిస్తున్నారు. రెండు నెలలుగా మేనేజర్, మూడేళ్లుగా ప్లాంట్ చార్జ్‌మెన్, ఐదేళ్లుగా ప్రాసెసింగ్ సూపర్‌వైజర్, పదేళ్లుగా ఫీల్డ్ సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నాలుగు ల్యాబ్ అసిస్టెంట్ పోస్టుల్లో ఒక్కరు మాత్రమే విధుల్లో చేరినా సెలవులో వెళ్లారు. నాలుగు ప్లాంట్ ఆపరేటర్ పోస్టులు ఏడాదికి పైగా, బాయిలర్ ఆపరేటర్ పోస్టు పదేళ్లుగా భర్తీకి నోచుకోవడం లేదు. దీంతోపాటు 15 మంది డాక్ వర్కర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరోపక్క విజయ డెయిరీలో అక్రమాలు సర్వసాధారణం కాగా.. ఉన్నతాధికారులు ఐదుగురు ఉద్యోగులపై వేటు వేశారు. కానీ ఈ పోస్టుల్లో కొత్త వారిని నియమించచడమో.. బదిలీపై ఇతర ప్రాంతాల వారిని రప్పించడమో చేయలేదు. దీంతో ఆ పోస్టులు ఖాళీగానే ఉండిపోయాయి. సిద్దిపేట నుంచి మేనేజర్‌ను ఖమ్మం బదిలీ చేసినా విధుల్లో చేరలేదు.

శీతలీకరణ కేంద్రాల్లో..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొత్తం 10 బల్క్‌మిల్క్ సెంటర్లను ఏర్పాటు చేయగా, వీటిలో ప్రస్తుతం ఆరే మిగిలాయి. ఖమ్మం జిల్లాలో ఆరు బల్క్‌మిల్క్ సెంటర్లకు గాను నాలుగు, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో నాలుగు బల్క్‌మిల్క్ సెంటర్లకు గాను రెండు మాత్రమే పనిచేస్తున్నాయి. ఒక్కో బల్క్ మిల్క్ సెంటర్‌లో ఐదుగురు ఉద్యోగులు పనిచేయాల్సి ఉండగా, ఇల్లెందు, కొత్తగూడెం బల్క్‌మిల్క్ సెంటర్లలో ఇద్దరు మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇక ప్లాంట్ ఆపరేటర్లు, డాక్ వర్కర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

లక్ష్యసాధనలో వెనుకంజ

ప్రస్తుతం ఖమ్మం జిల్లా నుంచి 5,800, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి 2,400 మొత్తంగా 8,200 లీటర్ల పాల సేకరణ జరుగుతోంది. ఈ మొత్తంలో 6 వేల లీటర్ల పాలు స్థానికంగా, 2 వేల లీటర్లు హైదరాబాద్ ప్రధాన ప్లాంట్‌కు తరలిస్తారు. 50వేల లీటర్ల లక్ష్యంలో 8,200 లీటర్ల పాలు సేకరణ జరుగుతుందంటేనే ప్లాంట్ దయనీయ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇలా లక్ష్యాలు నీరుగారుతున్నా ఖాళీల భర్తీపై సంస్థ యాజమాన్యం మీనమేషాలు లెక్కిస్తోంది. విజయ డెయిరీలో లోపాలను గుర్తించి ప్రైవేట్ డెయిరీలు జిల్లాలో 12కు పైగా సెంటర్లు ఏర్పాటుచేసి 1.50 లక్షల లీటర్ల మేర పాలను సేకరిస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం..



ఖమ్మం పాడి పరిశ్రమ(ప్లాంట్)లో ప్రధాన పోస్టులు భర్తీ చేయాలని ఉన్నతాధికారులకు నివేదించాం. రెగ్యులర్ ఉద్యోగులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాల సేకరణ పెంపు, క్షేత్ర స్థాయిలో రైతులను కలిసేందుకు సమస్య వస్తున్నందున ప్రధానమైన నాలుగు పోస్టులు మంజూరు చేయాలని కోరాం.

– ఏ.కుమారస్వామి, డీడీ, ఖమ్మం పాడి పరిశ్రమ

కోల్ రిసీవింగ్ సెంటర్ సందర్శన

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి జేవీఆర్ ఓసీ సమీపంలోని కోల్ రిసీవింగ్ సెంటర్, ఈపీసీ, సీహెచ్‌పీలను సింగరేణి పీఅండ్‌పీ డైరెక్టర్ జి.వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. కోల్ రిసీవింగ్ సెంటర్‌లోని బెల్ట్ 4 – ఏ, 4 – బీని పరిశీలించారు. గత వారం రోజులుగా పని చేయని పీసీఆర్ – 2ను సరిచేసి నడిపించాలని అధికారులను ఆదేశించారు. సీహెచ్‌పీని శుభ్రంగా ఉంచాలని, సీహెచ్‌పీలో డస్ట్ కోల్ ఉండవద్దని సూచించారు. కార్యక్రమంలో జీఎం ఎం.సుధాకర్‌రావు, సింగరేణి అధికారులు రాఘురామిరెడ్డి, ఎస్.వెంకటాచారి, లక్ష్మణమూర్తి, కృష్ణయ్య, మదీనాపాషా, మధుసూదన్‌రావు, రమణారెడ్డి, సోమశేఖర్ పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న డైరెక్టర్, అధికారులు

ఓవరాల్ చాంపియన్ 'ఖమ్మం'

- బాలుర విభాగంలో హనుమకొండ జట్టు
- బాలికల విభాగంలో నాగర్‌కర్నూల్
- ముగిసిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు



ఓవరాల్ చాంపియన్‌షిప్ అందుకుంటున్న ఖమ్మం జిల్లా అథ్లెట్లు

వరంగల్ స్పోర్ట్స్: షైన్ 9వ రాష్ట్ర ఫెడరేషన్ కప్, అండర్–20 జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌ను ఖమ్మం జిల్లా కైవసం చేసుకుంది. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన రెండు రోజులుగా జరుగుతున్న అథ్లెటిక్స్ పోటీలు ఆదివారం ముగిశాయి. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి వచ్చిన 380 మంది క్రీడాకారులు 40 ఈవెంట్లలో పోటీపడ్డారు. ఖమ్మం జిల్లా ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకోగా.. బాలుర విభాగంలో ఆతిథ్య హనుమకొండ జిల్లా క్రీడాకారులు, బాలికల విభాగంలో నాగర్‌కర్నూల్ క్రీడాకారులు అత్యధిక పాయింట్లు సాధించి ట్రోఫీ అందుకున్నారు. ముగింపు వేడుకలకు హాజరైన 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్ విజేతకు ట్రోఫీతో పాటు క్రీడాకారులకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 28 నుంచి తమిళనాడు రాష్ట్రం తిరువన్నమలైలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వరంగల్ అథ్లెటిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు మూగల కుమార్‌యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు, వరంగల్ జిల్లా కార్యదర్శి యుగంధర్‌రెడ్డి, బాధ్యులు లెక్కల రాజిరెడ్డి, నాగమణి, కోచ్‌లు శ్రీమన్నారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భూపతిరావుకు బంగారు నంది అవార్డు



సికింద్రాబాద్‌లో అవార్డు అందుకుంటున్న భూపతిరావు

భద్రాచలంఅర్బన్: భద్రాచలానికి చెందిన రిటైర్డ్ ఉద్యాన శాఖ అధికారి డాక్టర్ గోళ్ల భూపతిరావు బంగారు నంది అవార్డు అందుకున్నారు. సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మంత్రి సత్యవతి రాథోడ్, దైవజ్ఞ శర్మ, సినీ హీరో కిరణ్ తదితరుల చేతుల మీదుగా ఈ అవార్డు స్వీకరించారు. భూపతిరావు ఉద్యాన అధికారిగా విధులు నిర్వహించిన సమయంలో గిరిజనులతో 5 లక్షలపైగా పండ్ల మొక్కలు నాటించడమే కాక వారికి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఆయన సేవలను గుర్తించిన అధికారులు గతంలో కూడా 40కి పైగా అవార్డులు ప్రదానం చేశారు. ఉద్యోగ విరమణ తర్వాత కూడా గ్రీన్ భద్రాద్రిలో ప్రముఖ పాత్ర పోషిస్తూ కొన్ని వేల మొక్కలు భద్రాచలంలో నాటించారు. ఇప్పుడు అవి వృక్షాలై పాదచారులకు నీడ, ప్రాణవాయువు అందిస్తున్నాయి. పర్యావరణంలో ఆయన కృషికి ఢిల్లీ నుంచి జాతీయ అవార్డు, పాండిచ్చేరి నుంచి డాక్టరేట్ లభించాయి.

గురుకుల ప్రవేశ పరీక్షకు 6,768 మంది..



ఖమ్మంలోని ఓ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రత్యూష

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2023 – 24 విద్యా సంవత్సరంలో 6 నుంచి 9వ తరగతి వరకు గల బ్యాక్ లాగ్ ఖాళీల్లో ప్రవేశాల కోసం ఆదివారం పరీక్ష నిర్వహించగా 6,768 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆర్సీఓ కె.ప్రత్యూష తెలిపారు. ఖమ్మం రీజియన్‌లోని ఖమ్మం జిల్లాలో 8 సెంటర్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 5 సెంటర్లు, మహబూబాబాద్ జిల్లాలో 6 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. మొత్తం 7,944 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా.. 6,768 మంది పరీక్షకు హాజరయ్యారని, 1,176 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. ఖమ్మం జిల్లాలో 3,077 మందికి 2,628 మంది, భద్రాద్రి జిల్లాలో 2,131 మందికి 1,825 మంది, మహబూబాబాద్ జిల్లాలో 2,736 మందికి 2,315 మంది హాజరయ్యారని తెలిపారు. కాగా ఆర్సీఓ ప్రత్యూషతో పాటు అధికారులు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.